క్లుప్తంగా

రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ చోరీ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ చోరీ అయ్యింది. బుధవారం తెల్లవారుజామున ఆలయం శుభ్రం చేసేందుకు వచ్చి మహిళ కిటికీ అద్దాలు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించి భయంతో మఠం పూజారి బాలకృష్ణచారికి సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న పూజారి హుండీని ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దొంగలు హుండీని ఆలయం వెనకనుంచి రైల్వే పట్టాలు దాటుకుంటూ మోసుకెళ్లినట్లుగా ఆనవాళ్లు కనపడ్డాయి. రైల్వే పట్టాలపై రూ.5వేల వరకు పడి ఉండటాన్ని గుర్తించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ చోరీకి గురి కావడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షలో పట్టుబడిన విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం జరిగిన ద్వితీయ సంవత్సర 4వ సెమిస్టర్ పరీక్షలో నలుగురు విద్యార్థులు చూచిరాస్తుండగా పట్టుకున్నారు. వారిని పరీక్ష నుంచి బయటకు పంపించారు. మాచారం వద్ద ఉన్న నాగర్‌కర్నూలు గిరిజన బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థి తన తప్పిదం లేదంటూ గంటపాటు పరీక్ష కేంద్రం వద్దే ఉండిపోగా పోలీసుల సహాయంతో బయటకు పంపించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



జడ్చర్ల టౌన్: 44వ నంబరు జాతీయ రహదారిపై మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి వద్ద స్కూటీని డీసీఎం ఢీ కొట్టిన ఘటనలో స్కూటీపై ఉన వి.వినోద్‌కు వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం తరువాత జరిగిన ఘటనలో గాయపడిన వ్యక్తిని 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి ఆధార్‌కార్డు ఆధారంగా వినోద్ గుర్తించినప్పటికి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ అధికారుల నూతన సెల్ నంబర్లు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల విద్యుత్ డివిజన్‌లోని ఏఈ, ఏడీలతో పాటు ఫోన్ నంబరు పాతవాటి స్థానంలో నూతనంగా కేటాయించినట్లు డీఈ చంద్రమౌళి తెలిపారు. తన నంబరు 8712472224, ఏడీఈ 8712472236 గా మార్చుకోవాలని తెలిపారు. అదే విధంగా జడ్చర్ల టౌన్ ఏఈ 8712472227, రూరల్ ఏఈ నంబరు 8712472225, మిడ్జిల్ ఏఈ 8712472235, ఏఈ అడ్డాకుల 8712472232, ఏఈ మూసాపేట 8712472238, ఏఈ భూత్పూర్ 8712472236గా మార్చబడినట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సమస్యలు ఏవైనా కొత్త ఫోన్ నంబర్లకు చేయాలని పిలుపునిచ్చారు.

కందూర్‌లో 'హోల్కర్' జయంతి



అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం రాణి అహల్యాబాయ్ హోల్కర్ 300వ జయంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు బోయ రమేష్ ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించి పూజ చేశారు. మూసాపేట మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం వద్ద మండలాధ్యక్షుడు నర్సింహ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో గట్టు మల్లేష్, లక్ష్మి, కొండారెడ్డి, రవీందర్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

దేవరకద్ర రూరల్: అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం అందించే పథకాలు పార్టీలకు అతీతంగా అందిస్తున్నామని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు అన్నారు. బుధవారం కౌకుంట్లకు చెందిన నీలి సూజాతకు చెందిన రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో యువజన అధ్యక్షుడు నరేష్, ఉపసర్పంచ్ నర్సింహులు పాల్గొన్నారు.

అమృత్ 2.0 పనుల్లో వేగం పెంచాలి

అమరచింత: ఆత్మకూర్, అమరచింత పట్టణాల్లో చేపడుతున్న అమృత్ 2.0 తాగునీటి పనుల నిర్మాణంలో వేగం పెంచి, అనుకున్న సమయంలో ప్రజ లకు స్వచ్ఛమైన తాగునీటి అందించాలని డీఈ శ్రీనివాస్‌రావు అన్నారు. పట్టణంలో చేపడుతున్న పనులను బుధవారం పరిశీలించారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

● కలెక్టర్ విజయేందిర బోయి



కోడ్గల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల టౌన్: కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన వరిధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం జడ్చర్ల మండలంలో ఆమె పర్యటించారు. కోడ్గల్, గంగాపురం గ్రామాల్లోని పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పరీక్షించారు. ధాన్యం బస్తాలను పరిశీలించి త్వరగా కొనుగోలు కేంద్రానికి టాగ్ చేసిన రైస్ మిల్లుకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తేమ నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి క్రమ పద్ధతిలో టోకెన్లు అందజేసి రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లులకు రవాణా చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ప్రతిరోజు ఎన్ని లారీలు రవాణా చేసేందుకు ఏర్పాటు చేశారని అడిగి తెలుసుకున్నారు. 6లారీల ద్వారా ధాన్యాన్ని రవాణ చేస్తున్నట్లు అధికారులు ఆమెకు వివరించారు. అయినప్పటికి ఇంకా ధాన్యం బస్తాలు ఉండటం గమనించి వెంటనే వాటిని తరలించేందుకు చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని, అన్ని మౌలిక సదుపాయా లు కల్పించాలని, ప్యాడి క్లీనర్‌లను ఉపయోగించి ధాన్యం శుభ్రపర్చాలని రైతులకు, నిర్వహకులకు సూచించారు. ఆమె వెంట పౌరసరఫరాల సంస్థ డీఎం రవినాయక్ ఉన్నారు.

పీహెచ్‌సీలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఆగ్రహం

మండల పర్యటనలో భాగంగా గంగాపురం ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో పీహెచ్‌సీ పరిసరాలు, గదులు అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతినెలా పీహెచ్‌సీలో నిర్వహించే ప్రసవాల గూర్చి అడిగి తెలుసుకుని ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె పర్యటనలో డిప్యూటీ తహసీల్దార్ కిషోర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



పోల్కంపల్లి బీటీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేవిధంగా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గంలోని ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవరకద్ర, సీసీకుంట, మదనాపురం, కొత్తకోట, అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాలకు చెందిన అధికారులు సమీక్షకు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలపై గ్రామాల వారీగా సమీక్ష చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసిన వారిలో 4,572 దరఖాస్తుదారులు ఇందిరమ్మ ఇళ్లకు అర్హత సాధించాయని, నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇళ్లు కేటాయించామన్నారు. దశల వారిగా మిగతా వారికి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పురోగతి సాధించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా అర్హత కలిగిన వారిని రాజీవ్ యువ వికాసం పథకానికి ఎంపిక చేయాలని సూచించారు. అంతకు ముందు మూసాపేట మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి పోల్కంపల్లి వరకు ఇటీవల వేసిన బీటీరోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకం ప్రకటించడం సంతోషం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే వారికి రూ.లక్ష ప్రోత్సాహకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రకటించిందని జిల్లా కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం అధ్యక్షులు తెలుగు వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఒక దివ్యాంగులు ఉంటే వర్తించేది కాదన్నారు. ఒక సాధారణ వ్యక్తి ఉండాలనే నిబంధన ఉండేదన్నారు. రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఈ విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం సీఎం గొప్ప నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే వారికి రూ.లక్ష ప్రోత్సాహక జీఓ మంగళవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ జారీ చేసినట్లు తెలిపారు. దివ్యాంగుల సమస్య పరిష్కారానికి కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రి సీతక్క, టీపీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చిన్నచింతకుంటలో తిరంగా ర్యాలీ

చిన్నచింతకుంట: ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా గురువారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో బాల గంగాధర్ తిలక్ యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా నాయకులు నంబిరాజు, కుర్వ రమేష్‌లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పార్టీలకు అతీతంగా తరలి వచ్చి వీర సైనికులకు సంఘీభావం తెలపాలని కోరారు.

25న వక్ఫ్ సవరణ చట్టంపై బహిరంగసభ



సమావేశంలో మాట్లాడుతున్న మౌలానా నయీం కౌసర్ రషాదీ

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు సభ కన్వీనర్ మౌలానా నయీం కౌసర్ రషాదీ వెల్లడించారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహిరంగసభకు ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవేసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షులు మౌలానా ఖాలెద్ సైపుల్లా, కర్నాటకకు చెందిన మాజీ కేంద్రమంత్రి సీఎం ఇబ్రహీం, జామియా నిజామియాకు చెందిన ముఫ్తి ఖలీల్ అహ్మద్, కోల్‌కత్తాకు చెందిన మౌలానా అబుతాలిబ్ రహెమాని, జమాలుర్ రహెమాన్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. మహిళలకు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ఆయా ముస్లిం సంఘాలు, మతపెద్దలు, పార్టీల ప్రతినిధులు అబ్దుల్ హాదీ, ఇంతియాజ్ ఇసాక్, మౌలానా అబ్దుల్లా ఖాన్ హామెద్, మౌలానా అబ్దుల్ రహెమాన్ రషాది, తఖీ హుస్సేన్, గులాం గౌస్, మిర్జా ఖుద్దూస్‌బేగ్, మహ్మద్ జహీరుద్దీన్, హాఫిజ్ ఇద్రీస్, నయీం ఇమ్రాన్, మౌలానా హాఫిజ్ ఖాజా ఫైజొద్దీన్, మౌలానా ఆయిషా రషాది పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమాన్ జయంతి



గాధిర్యాల్ వీరహనుమాన్ ఆలయం దగ్గర యజ్ఞం చేస్తున్న భక్తులు

మహమ్మదాబాద్: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని గాధిర్యాల్ వీరహనుమాన్ ఆలయం దగ్గర రెండోరోజు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం అనంతరం యాగశాల ప్రవేశం హనుమత్ హోమం, శ్రీరామహోమం, రుద్రహోమం, 21 యజ్ఞగుండముల దగ్గర 83మంది దంపతులు యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతరం పూజా కార్యక్రమాలకు వచ్చిన భక్తులకు ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ తరపున ఆర్థికసాయం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నీటి పారుదల శాఖలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నరహరి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి టీఎన్‌జీఓ తరపున రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. బుధవారం టీఎన్‌జీఓ భవన్‌లో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి నరహరి భార్య సుకన్యకు నగదు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వేకు రైతులు సహకరించాలి

గండేడ్: భూ భారతి సర్వేకు రైతులు సహకరించాలని అడిషనల్ కలెక్టర మోహన్‌రావు అన్నారు. భూభారతి కార్యక్రమంలో బుధవారం గండేడ్ మండలపరిధిలోని సాలార్‌నగర్‌లో జరిగిన గ్రామసభ ఆయన మాట్లాడుతూ భూసర్వేలో పారదర్శకత పాటించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్తగా భూ భారతి పోర్టల్‌ను తెచ్చిందన్నారు. దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్వేలో లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అడిస్టెంట్ డైరెక్టర్ కిషన్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ మాధవి, ఆర్‌వీ సంస్థ ప్రతినిధి విక్రమ్‌రెడ్డి, ఆర్‌ఐ యాసిన్, నాయకులు జితేందర్‌రెడ్డి, నర్సింహారావు, బాలస్వామి, పుల్లారెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గండేడ్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో వచ్చే అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయొద్దని, ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దన్నారు. ఏమైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తగ్గిన ఉల్లి సీజన్.. పెరగని ధరలు



దేవరకద్ర మార్కెట్ యార్డులో అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: ప్రతి బుధవారం జరిగే వేలానికి వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున దేవరకద్ర మార్కెట్‌కు ఉల్లిని తీసుకొస్తారు. ఐదు నెలల నుంచి కొనసాగిన ఉల్లి సీజన్ తగ్గిపోయింది. ఆరంభంలో 5 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వస్తుండగా.. మూడు వారాలుగా వెయ్యి బస్తాలకు మించి రాలేదు. ధరలు కూడా నిలకడగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం జరిగిన వేలంలో ఉల్లి గరిష్ఠంగా రూ.1,400, కనిష్ఠంగా రూ.1,000 వరకు ధరలు వచ్చాయి. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిని ఎక్కువగా వినియోగదారులే కొనుగోలు చేశారు. వ్యాపారులు బస్తాకు రూ.50 నుంచి రూ.వంద వరకు లాభం చూసుకుని ఉల్లిని విక్రయించారు. మధ్యాహ్నం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2000లుగా ఒకే ధర పలికింది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఆత్మకూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తప్పవని, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని వ్యవసాయశాఖ ఏడీఏ దామోదర్ అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని విత్తన, ఫర్టిలైజర్స్ షాపులను వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాల నిల్వలు, వాటి కంపెనీలు, గడువు తేదీలు, లైసెన్సు, స్టాక్ రిజిస్టర్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాక అధికారి వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆధునిక భారత నిర్మాత రాజీవ్‌గాంధీ

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, చైర్మన్లు, నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆధునిక భారత నిర్మాత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం అశోక్‌టాకీస్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించి, యువతకు భారత నిర్మాణంలో భాగస్వామ్యం చేశారన్నారు. నాడు విశ్వవిద్యాలయాల్లో, కళాశాలల్లో కంప్యూటర్లను అందజేసి సూపర్ కంప్యూటర్‌ను దేశానికి తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్, సాయిబాబా, రాములుయాదవ్, ఫయాజ్, అజ్మత్‌అలీ, అవేజ్, నాగరాజు, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

● స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మహమ్మదాబాద్ మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ యువ నాయకులు భరత్ కుమార్, శివగౌడ్, వెంకటేశ్, అనంతయ్యగుప్త, లాలయ్య, రాజమహేందర్‌రెడ్డి, అరుణ్, అచ్చన్న, శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

యాసంగిలో వేరుశనగ పంట సాగు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేష్

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్- ఆయిల్స్ సీడ్స్ (2025–26 నుంచి 2030–31 పథకం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వచ్చే యాసంగి సీజన్ నుంచి కొత్త రకం విత్తనాలతో వేరుశనగ పంటను సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. బుధవారం కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.వెంకటేష్ మహబూబ్‌నగర్ జిల్లా ఆయిల్ సీడ్స్ జిల్లా ఎంపికైందని, ఆ స్కీం ఐదేళ్ల కాలపరిమితి ఉంటుందని తెలిపారు. నూనెగింజల పంటల సాగును పెంచడం ఉద్దేశమని, నూనెగింజల సాగు తగ్గిపోతుందని, మనం ఇతర దేశాల నుంచి నూనెను దిగుమతి చేసుకోవాల్సిన వస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లాలో వచ్చే యాసంగి సీజన్‌లో వేరుశనగ సాగును 1250 ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టిందని, అందులో భాగంగా వెయ్యి ఎకరాలకు ఉచితంగా వేరుశనగ విత్తనాలు ఇవ్వడం జరుగుతుంది. మరో 250 ఎకరాలకు సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. కొత్త రకం విత్తనాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఆత్మ పీడీ గోవింద్‌నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, నాబార్డు ఏజీఎం షణ్ముకచారి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ భరత్ భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టు ప్రదర్శన



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యాశాఖ, భూమి ఎన్జీఓలు సయుక్తంగా 12 రోజుల పాటు 150 మంది విద్యార్థులకు గాంధీరోడ్డు పాఠశాల మాడల్‌బేసిక్, బీపీహెచ్‌ఎస్ పాఠశాలలో శిక్షణ ఇచ్చారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న పలు అంశాలపై ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్ ప్రాజెక్టులను పరిశీలించి, శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఒక చక్కటి వేదికగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, జీహెచ్‌ఎం విజయ్‌కుమార్, భూమి ఫౌండేషన్ ప్రతినిధి శివాని, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యార్థులకు అందించేందుకు జిల్లా పాయింట్ నుంచి మండల పాయింట్లకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన సమయం ప్రకారం, సకాలంలో అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కంటి వైద్య పరీక్షలు



దేవరకద్రలో కంటి పరీక్షలు చేస్తున్న రాంరెడ్డి కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వైద్య పరీక్షలు చేసిన వైద్య నిపుణులు 40 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారందరిని ప్రత్యేక వాహనంలో కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించారు. వారందరికి రాక పోకల కోసం సౌకర్యం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్య బృందం శ్రీలత, సత్యంగౌడ్, ఖాజా పాల్గొన్నారు.

పచ్చిరొట్టె విత్తనాలతో ప్రయోజనం



రైతులకు పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆగ్రో రైతు సేవా కేంద్రం నిర్వాహకులు

గండేడ్: రైతులకు పచ్చిరొట్టె విత్తనాలతో ప్రయోజనం జరుగుతుందని వ్యవసాయ శాఖ ఏఓ రాంపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రంలో జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి, పులిందర్‌రెడ్డి, శరనప్ప, ఆగ్రోస్ నిర్వాహకులు శ్రీనయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ భవన నిర్మాణ పనుల పరిశీలన



మున్సిపల్ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్‌లు

జడ్చర్ల టౌన్: మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులను బుధవారం చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డిలు పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పరిశీలనలో వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, వార్డుకౌన్సిలర్ కుమ్మరిరాజు, నాయకులు బుక్క వెంకటేశంలు ఉన్నారు.